అర్నబ్‌తో అతలాకుతలం

- తుఫాన్ దెబ్బకు అన్నదాతలు విలవిల
- వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- జనజీవనం అస్తవ్యస్తం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: అర్నబ్ తుఫాన్‌తో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలు అతలాకుతలమయ్యాయి. తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, భారీ గాలులతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వేల ఎకరాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి. భారీ గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

జంక్షన్‌లో..

అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలు, ఈదురుగాలులతో హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. బాపులపాడు మండలంలో పలుచోట్ల చెట్లు నేలకు ఒరగగా, వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. కానుమోలు, ఆరుగొలను, కాకులపాడు, వీరవల్లి, బండారుగూడెం, కోడూరుపాడు, అంపాపురం గ్రామాల్లో వరి పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈదురుగాలుల ధాటికి వరి పంట నేలకు ఒరిగిపోయింది. దీంతో ఆరుగాలం కష్టించి సాగు చేస్తున్న రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి కోతదశకు వచ్చిన తరుణంలో తుఫాన్ దెబ్బకు పూర్తిగా నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు విద్యుత్ తీగలపై పడిపోవటంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు స్పందించి చెట్లు తొలగించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

పెనమలూరులో..

పెనమలూరు: అర్నబ్ తుఫాన్ కారణంగా మండల పరిధిలో జనజీవనం స్తంభించింది. ఈదురు గాలులు, వర్షం కారణంగా మండలంలో మంగళవారం రాత్రి నుంచి ప్రతికూల వాతావరణం ఏర్పడింది. అర్ధరాత్రి వచ్చిన ఈదురు గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు అంధకారంలో గడిపారు. పోరంకి రామాపురం కాలనీ రోడ్డులో చెట్టు విద్యుత్ తీగలపై పడిపోవటంతో మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో పోరంకి ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పనులు చేపట్టి మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. అలాగే తాడిగడప కార్మికనగర్ ప్రాంతంలో ఈదురు గాలుల కారణంగా ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరి వచ్చి విద్యుత్ లైన్లపై పడింది. దీంతో పెద్ద శబ్దంతో మంటలు చెలరేగి విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రాత్రి సమయం కావటంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది బుధవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండల పరిధిలో గాలులు కారణంగా తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లల్లోనే ఉండి పోయారు.

కె.సీతారామపురంలో నేలపై ఒరిగిన వరి పంట

కానూరులో మురుగునీరు

కానూరులో డ్రెయినేజీలు పొంగటంతో మురుగునీరు అపార్టుమెంట్‌లు, ఇళ్లల్లోకి చేరాయి. ఇటీవల కానూరులో రూ.కోట్లు ఖర్చు చేసి డ్రెయినేజీలు నిర్మాణం చేసినా వర్షం పడితే మురుగునీరు రోడ్లపైకి చేరటం, ఇళ్లల్లోకి మురుగునీరు వచ్చి విలయ తాండవం చేస్తోంది. డ్రెయినేజీల నిర్మాణంలో డొల్లతనం బయటపడింది. యనమలకుదురు, పోరంకి ప్రాంతాల్లో కూడా మురుగునీరు రోడ్లపైకి చేరటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

నేలకూలిన చెట్లు

గన్నవరం: అర్నాబ్ తుఫాన్‌తో భారీ వర్షంతో కూడిన ఈదురుగాలులకు గన్నవరం ప్రాంతంలోని పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. స్థానిక రాయ్‌నగర్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలడంతో విద్యుత్ సరఫరా లైన్లు తెగిపడడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్రమత్తమైన గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు నేతృత్వంలో సిబ్బంది నేలకూలిన చెట్లను తొలగించి రోడ్లపై రాకపోకలను పునరుద్ధరించారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేయడంతో ఆయా ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు ఈఓ తెలిపారు. ఇంకా పలు గ్రామాల్లో తుఫాన్ కారణంగా చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

585 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

ఉంగుటూరు(గన్నవరం): అర్నబ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి గద్దె రమేష్ మానికొండ, నందమూరు, ఇందుపల్లి గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నేల కొరిగిన పొల్లాల్లో వరి పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. మండలంలో తొమ్మిది గ్రామాల్లోని 585 ఎకరాల్లో పొట్ట దశలో ఉన్న వరి పంట నేలకొరిగినట్లు ఏఓ తెలిపారు. పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న అరటి తోటలు

పెనమలూరు: అర్నబ్ తుఫాన్ కారణంగా అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురు గాలులకు అరటి తోటలు నేలకూలాయి. మండల పరిధిలో దాదాపు 300 ఎకరాల్లో అరటి తోటల సాగు జరుగుతుంది. పంట బాగా ఎదిగి గెలలు వేశాయి. మరో నెల రోజుల్లో పంట చేతికి వచ్చే పరిస్థితి ఉంది. అయితే అర్నబ్ రూపంలో తుఫాన్ విరుచుకు పడటంతో అరటి సాగు రైతులు కోలుకోలేని దెబ్బ తిన్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఉద్యాన అధికారులు ఫీల్డ్‌లో పరిశీలించారు. ఈ మేరకు ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి పంపారు. అరటికి నష్టం జరిగిందని తెలిపారు. అలాగే కంద పంటకు కూడా నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. గతంలో పంట నష్టపరిహారం అందలేదని, ఈ సారైనా ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బండారుగూడెంలో దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతు

బాపులపాడు శ్మశానవాటిక వద్ద విద్యుత్ తీగలపై పడిన తాటి చెట్టు

రామవరప్పాడులో హైవేపై నిలిచిన వర్షంనీరు

కానూరులో 80 అడుగుల రోడ్డులో అపార్ట్‌మెంట్‌లోకి చేరిన డ్రెయినేజీ నీరు

గన్నవరంలో నేలకూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

ఉంగుటూరు మండలంలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్, సిబ్బంది

క్లుప్తంగా

సుజుకి విక్టోరియస్ అరుమ్ కారు మార్కెట్‌లోకి విడుదల

లబ్బీపేట(విజయవాడతూర్పు): సుజుకి కంపెనీకి చెందిన సరికొత్త ఎడిషన్ విక్టోరియస్ అరుమ్ కారును బుధవారం కామాయిలోని సంతోష్ మారుతీ షోరూమ్‌లో లాంఛనంగా మార్కెట్‌లోకి విడుదల చేశారు. సుజుకి ప్రీమియమ్ ఎస్‌యూవీ విక్టోరియస్ మార్కెట్‌లోకి విడుదల చేసి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సరికొత్త విక్టోరియస్ అరుమ్ కారును మార్కెట్‌లో ప్రవేశ పెట్టారు. ఈ సరికొత్త కారును సంతోష్ మారుతీ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్ ఆవిష్కరించి తొలి కస్టమర్‌కు తాళాలు అందించారు. ఈ సందర్భంగా చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విక్టోరియస్ అరుమ్‌లో ఆధునాతన సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రాజనాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

5న పరిషత్ ఎన్నికలు

పెనమలూరు: మండల పరిషత్ ఎన్నికల తేదీలు మారాయని రిటర్నింగ్ అధికారి అన్నపూర్ణాదేవి తెలిపారు. ఆమె బుధవారం వివరాలు తెలుపుతూ గతంలో ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఎన్నికలు నవంబర్ 3న, కౌంటింగ్ 5న జరగాల్సి ఉందన్నారు. అయితే ఎన్నికల కమిషన్ బుధవారం ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎన్నికల పోలింగ్ 5వ తేదీ, కౌంటింగ్ 7వ తేదీకి మార్పు చేశారన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మార్పు జరిగిన తేదీలు గమనించాలన్నారు. నవంబర్ 4వ తేదీన పెనమలూరు జడ్పీ హైస్కూల్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాల సిబ్బంది సామగ్రి పంపిణీ చేస్తామన్నారు. నవంబర్ 7వ తేదీ ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు.

సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గుడివాడలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగిన యోనెక్స్ సన్ రైజ్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన కోనేరు మోక్షజ్ఞ సాయి ప్రతిభ చూపాడు. బెంగళూరులో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా నగరంలోని బ్యాడ్మింటన్ అకాడమీలో సాయిని బుధవారం పలువురు అభినందించారు. కోచ్ గంగాధర్ మాట్లాడుతూ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ అండర్-15 బాలుర విభాగంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో మోక్షజ్ఞ సాయి విజయం సాధించడంతో పాటుగా జాతీయ స్థాయి సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు నేరుగా అర్హత సాధించాడన్నారు. నేషనల్స్‌లోనూ మోక్షజ్ఞ సాయి ప్రతిభ చూపాలని అకాడమీలోని క్రీడాకారులు ఆకాంక్షించారు.

రెండు ఎంపీటీసీ సెగ్మెంట్ల బరిలో టీడీపీ రెబల్స్

గన్నవరం: మండలంలో టీడీపీలో నెలకొన్న వర్గ పోరు కారణంగా ఎంపీటీసీ ఎన్నికల్లో ఆ పార్టీకి రెబల్స్ బెడద వెంటాడుతోంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వ్యతిరేక వర్గానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి బసవరావు తన అనుచరులను కేసరపల్లిలోని రెండు ఎంపీటీసీ సెగ్మెంట్లలో స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దించారు. సదరు అభ్యర్థులను పోటీ నుండి తప్పించేందుకు టీడీపీ నేతలు ప్రయత్నాలు చేసినప్పటికి సఫలం కాలేదు. దీంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో టీడీపీ రెబల్స్‌గా ఉన్న ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించారు. వీరిలో జనసేనకు కేటాయించిన కేసరపల్లి-1 సెగ్మెంట్ నుంచి యారగాని రత్తయ్య, టీడీపీకి కేటాయించిన కేసరపల్లి-3లో శొంఠి కిషోర్ రెబల్ అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. టీడీపీ రెబల్స్‌గా పోటీచేస్తున్న వీరికి యార్లగడ్డ వ్యతిరేక వర్గం వెన్నుదన్నుగా నిలుస్తుండడంతో కూటమి పార్టీల నేతల్లో గుబులు మొదలైంది. వైఎస్సార్ సీపీ, కూటమి పార్టీలతో పాటు టీడీపీ రెబల్స్ అభ్యర్థులు పోటీ చేస్తున్న ఈ రెండు ఎంపీటీసీ సెగ్మెంట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గుంటతిప్ప డ్రెయిన్ ఆక్రమణలపై ఉక్కుపాదం

ఆటోనగర్(విజయవాడతూర్పు): గుంటతిప్ప డ్రెయిన్ ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని ఐలా కమిషనర్ కె.బాబ్జీ హెచ్చరించారు. యూసీ హోటల్ ముందు గుంటతిప్ప డ్రెయిన్ వద్ద ఉన్న ఆక్రమణలను బుధవారం ఆయన ప్రొక్లెయిన్‌తో తొలగించారు. కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించే పనులను ప్రారంభించారు. అర్నబ్ తుఫాన్ కారణంగా ఈ డ్రెయిన్‌లోకి భారీగా వర్షంనీరు చేరింది. నీరు పారకపోవడంతో అడ్డుగా ఉన్న ఆక్రమణలను తొలగించారు. పలువురు ఆక్రమణ దారులతో ఆయన మాట్లాడి ఆక్రమణలను తొలగించారు. ఐలా కమిషనర్ మాట్లాడుతూ.. డ్రెయిన్ ఆక్రమించినవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. లేకుంటే అన్నింటిని తొలగిస్తామన్నారు. ఈవిషయంలో ఎవరితో రాజీపడమన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో విజయవాడలో ఓటు హక్కు కలిగి ఉండి, పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం మొగల్రాజపురంలోని పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో ధ్యాన్‌చంద్ బ్లాక్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఎన్నికల విధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌తో పాటు ఓటర్ ఐడీ కార్డు లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకువెళ్లి అక్టోబర్ 29, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని కమిషనర్ వివరించారు.

ప్రజా వంచక పాలనకు చరమగీతం పాడాలి

ముమ్మరంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం

కంకిపాడు: ప్రజా వంచక పాలనకు చరమగీతం పాడాలని వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి నందిపాటి బిందుమాధవి, పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి పిలుపునిచ్చారు. మండలంలోని ఈడుపుగల్లు సెగ్మెంట్-2లో ఎంపీటీసీ అభ్యర్థి బూరగ హిమబిందు, మద్దూరు ఎంపీటీసీ అభ్యర్థి వీరంకి స్వాతితో కలిసి బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా బిందుమాధవి, శ్రీహరిరాణి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అటకెక్కించి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలూ సంక్షేమం అందక అవస్థలు పడుతున్నారన్నారు. నిత్యావసరాల ఆకాశాన్నంటటంతో పేద, మధ్యతరగతి వర్గాల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అర్నబ్ తుఫాన్‌తో పంట నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో సమగ్రంగా సర్వే పూర్తి చేయాలని, బాధిత రైతాంగానికి పరిహారం అందేలా చూడాలన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలి..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ అభ్యర్థులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రసాదంపాడులో 4వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి సాదం నీలిమ ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తన సెగ్మెంట్‌లోని ఓటర్లను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని 1, 2, 3వ సెగ్మెంట్ల అభ్యర్థులు మధుసూదనరావు, పి.అజయ్, లంకా శ్రీనివాసరావు తమ తమ సెగ్మెంట్‌లలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. అలాగే రామవరప్పాడులో 1వ సెగ్మెంట్ సమ్మెట లక్ష్మి, 2వ సెగ్మెంట్ ప్రత్తిపాటి అరుణకుమారి, 3వ సెగ్మెంట్ బల్లెం సునీత, 6వ సెగ్మెంట్ కూనపరెడ్డి సీతారామయ్య ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆర్. వెంకటేశ్వరరావు, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, మాజీ జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ప్రసాదంపాడు కన్వీనర్ పిన్నిబోయిన రవి కుమార్, నాయకులు బోయిన భాను, సాదం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడుపుగల్లు-2 సెగ్మెంట్‌లో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు బూరగ హిమబిందు, నందిపాటి బిందుమాధవి

ప్రసాదంపాడులో ప్రచారం చేస్తున్న 4వ సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి సాదం నీలిమ, పార్టీ శ్రేణులు

నున్నలో ఎన్నికల ప్రచారం

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నున్న గ్రామంలో 4వ సెగ్మెంట్ అభ్యర్థి మాలావతు పద్మ మ్యాంగో మార్కెట్ ఎదురుగా ఉన్న ఆర్కే అపార్టుమెంట్లలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల చైర్మన్ బందెల కిరణ్‌కుమార్‌ను, ఓటర్లను కలిసి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ సీనియర్ నాయకులు లేళ్ళ నిరంజన్, భూక్యా గోపి, రాహుల్, లేళ్ళ ఎర్రబ్బాయి, అబ్రహాం పాల్గొన్నారు. 3వ సెగ్మెంట్ అభ్యర్థి ప్రత్తిపాటి అనిత పార్టీ నాయకులతో ఎస్సీ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. 2వ సెగ్మెంట్ నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న యనగంటి రమాదేవి పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. 1వ సెగ్మెంట్ అభ్యర్థి షేక్ సైదాబి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నున్నలో కరపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ అభ్యర్థి పద్మ

చంద్రబాబుకు గుణపాఠం చెప్పండి

పెనమలూరు: ఓట్ల కోసం అమలుకాని వాగ్దానాలు చేసి జనాలను మోసం చేసి అధికారం చేపట్టిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో ఓటర్లు తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్ సీపీ పెదపులిపాక ఎంపీటీసీ అభ్యర్థి డాక్టర్ కేతరాజు అర్జున్‌రావు తెలిపారు. ఆయన బుధవారం పెదపులిపాకలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తానని గత ఎన్నికల్లో ప్రజలను నమ్మించారని ఆరోపించారు. అయితే అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. ఓట్లు వేసిన ప్రజలు ధగా పడ్డారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

స్థలం ఆక్రమణ కేసులో 9 మందికి జరిమానా

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఇంటి స్థలం ఆక్రమణ కేసులో తొమ్మిది మంది నిందితులకు నూజివీడు న్యాయస్థానం జరిమానా విధించిందని వీరవల్లి ఎస్ఐ సత్యం సురేష్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే.. బాపులపాడు మండలం తిప్పనగుంటలోని బడిపాటి విజయలక్ష్మి ఇంటి స్థలాన్ని 2021 జూలైలో ఆమె బంధువులు ఆక్రమించటంతో పాటుగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తి చేశారు. నూజివీడులోని జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదనలు పూర్తికావటంతో తొమ్మిది మంది నిందితులకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున న్యాయమూర్తి ఎం.శివపార్వతి జరిమానా విధించారని ఎస్ఐ సత్యం సురేష్ తెలిపారు.

इंडियन बैंक Indian Bank ALLAHABAD

మంగళగిరి బ్రాంచి

గౌతంబుద్ధ రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా, ఫోన్: 08645-234249, 9951331382, ఇ-మెయిల్: mangalagiri@indianbank.co.in

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

"APPENDIX - IV-A" [See proviso to rule 8(6) / 9(1)]

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)/9(1) తో చదువుకుననే నిబంధన క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన. ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)ల చేత సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఇండియన్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచికి తనఖా/ఛార్జ్‌గా వుంచిన దిగువ పేర్కొన్న స్థిరాస్తులను, ది.22.07.2026 నాటికి బకాయిసొమ్ము రూ.26,41,820/- (అక్షరాల ఇరవైఆరు లక్షల నలభైఒక్క వేల ఎనిమిది వందల ఇరవై రూపాయలు మాత్రమే) వసూలు నిమిత్తం ఇండియన్ బ్యాంక్, మంగళగిరి బ్రాంచి యొక్క అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. మరియు సదరు ఆస్తిని ది.20-11-2026 తేదీన "ఎక్కడ ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అది" మరియు "ఉన్నది ఉన్నట్లుగా" పద్ధతిపై సెక్యూర్డ్ క్రెడిటార్‌చే విక్రయించబడునని ఋణగ్రహీత : శ్రీమతి వల్లేటి ప్రనూష, తండ్రి: వల్లేటి రాంబాబు గారు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. ఇ- వేలం విధానం ద్వారా విక్రయించడానికి ఉద్దేశించిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరములు దిగువ పేర్కొనబడినవి.

స్థిరాస్తుల వివరములు

ఆస్తి నెం.1 : కృష్ణా జిల్లా, విజయవాడ, ప్రసాదంపాడు గ్రామము, ఆర్‌యస్ నెం.76 నందు 779 చ॥అ॥ల విస్తీర్ణముగల, ఉమ్మడి ఏరియా 219 చ॥అ॥లు, స్కూటర్ పార్కింగ్ ఏరియా 30 చ॥అ॥ల విస్తీర్ణముగల క్లాసిక్ హోమ్స్, 3వ అంతస్థు లోని ఫ్లాట్ నెం.టి-2 కు చెందిన అవిభాజ్యపు భాగమైన 28.5 చ॥గ॥ల విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : సి.హెచ్.వెంకటేశ్వరరావు మరియు ఇతరుల యొక్క ఆస్తి, దక్షిణం : చాగంటి కోటేశ్వరరావు యొక్క ఆస్తి, పడమర : కె.ఈశ్వరరావు యొక్క ఆస్తి, ఉత్తరం : 12 అ॥ల వెడల్పు గల రోడ్డు. 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.టి-2 కు హద్దులు : తూర్పు : ఉమ్మడి వరండా, దక్షిణం : ఉమ్మడి వరండా, పడమర : శూన్యాకాశము, ఉత్తరం : శూన్యాకాశము.

ఆస్తిపై ఎన్‌కంబరెన్స్	బ్యాంక్‌కు తెలిసినంత వరకు ఏమి లేవు
రిజర్వు ధర	రూ.25,95,600/-
ధరావత్తు సొమ్ము	రూ.2,59,560/-
బిడ్ పెంపుదల మొత్తం	రూ.10,000/-
ఇ-వేలం మొక్క తేదీ మరియు సమయం	తేది: 20-11-2026 ఉ॥10.00 గం॥ల నుండి సా॥04.00 గం॥ల వరకు
ఆస్తి ఐడి నెం.	IDIB50205027304

బిడర్లు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం దయచేసి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నెంబర్ 8291220220కు మరియు సర్వీస్ ప్రొవైడర్ హెల్ప్‌డెస్క్‌లో లభించే ఇతర హెల్ప్‌లైన్ నంబర్‌లకు కాల్ చేయండి PSB Alliance ప్రైవేట్ లిమిటెడ్‌తో రిజిస్ట్రేషన్ స్థితి కోసం దయచేసి support.baanknet@psballiance.com ను మరియు ఇయండి స్థితి కోసం support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఛాయాచిత్రం కోసం మరియు వేలం యొక్క నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.com ను సంప్రదించండి. ఈ పోర్టల్‌కు సంబంధించిన స్పష్టీకరణల కోసం, దయచేసి హెల్ప్‌లైన్ నెంబర్: 8291220220 ను సంప్రదించండి. https://baanknet.com వెబ్‌సైట్స్‌లో ఆస్తి కోసం పైన పేర్కొన్న ఆస్తి ఐడి ఉపయోగించి బిడ్డర్లు శోధించవలసినదిగా సలహా ఇవ్వడమైనది.

గమనిక: ఆస్తిని రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంప్ డ్యూటీ, బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చటబద్ధమైన/ చటబద్ధం కాని బకాయిలు, పన్నులు, రేట్లు, ఎసెస్‌మెంట్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు కొనుగోలుదారే భరించవలెను.

స్థలం: గుంటూరు, తేది: 28-10-2026 సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్,

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. ఈ ఫోన్ నెంబర్లకు తెలుపగలరు. తగు చర్యలు తీసుకొనబడును.
వి. రాజానరేంద్రబాబు - సర్క్యులేషన్ ఇంఛార్జి : 9010288885,
పెనమలూరు : బి. రవికుమార్ - 9059160256
గన్నవరం : ఆర్.జ్యోతిస్వరూప్ - 9494050247,
యం. శివకుమార్ - JO : 7093107744
టోల్ ఫ్రీ నెం. : 1800 2125 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు, శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచినవారు
మా ప్రతినిధిని క్రింది ఫోన్ నెంబర్‌లో సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)